## నాయుడుపేటలో భారీ చోరీ

నాయుడుపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని బాలాజీగార్డెన్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఒకే సమయంలో మూడు ఇళ్లలో భారీ చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి 40తులాల బంగారం, మూడు కిలోల వెండి, మూడు లక్షల రూపాయలు నగదు చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. దొంగతనం జరిగిన మూడు ఇళ్లు ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక పోలీసు కానిస్టేబుల్‌వి కావడం గమనార్హం. సమాచారం తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ దొంగల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పంట పొలాలపై ఏనుగుల దాడి

బంగారుపాళ్యం, ఆగస్టు 28 ప్రభాతవార్త:



మండలంలోని పులి మడుగు, వెలుతురు చేను గ్రామ వ్యవసాయ పొలాలపై ఏనుగుల గుంపు శనివారం రాత్రి దాడులు చేశారు. సమీప అటవీ ప్రాంతం నుండి ఈ ఏనుగుల గుంపు పొలాల వైపు వచ్చి పంటలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన రైతు రమేష్ చెరకు తోట, వరి పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేయగా, చిన్నపాపమ్మకు చెందిన వరి పంటను సైతం ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. ఈ మేరకు రైతులు అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

# విద్యారంగంలో విప్లవాత్మక మార్పు జగనన్నతోనే సాధ్యం

## మంత్రి ఆర్.కె.రోజా

పుత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త :

అమ్మఒడి, నాడు-నేడు, విద్య, వసతి దీవెన, విద్యాకానుక వంటి వినూత్న పథకాలతో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. సోమవారం నగరిలో జరిగిన విద్యా దీవెన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు పెత్తందారుల ఆస్తి అయిన విద్యను పేదవాడి హక్కుగా మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని ప్రశంసించారు. పేదరిక నిర్మూలన విద్యతోనే సాధ్యమని బలంగా నమ్మిన జగనన్న కోటీశ్వరుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉండే నాణ్యమైన విద్యను పేదవాడి బిడ్డకు కూడా అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఈ రాష్ట్రంలో ఆటో డ్రైవర్ కొడుకు ఆటోమొబైల్ ఇంజనీరింగ్, మెకానిక్ కొడుకు మెకానికల్ ఇంజనీరింగ్, వ్యవసాయ కూలీ కొడుకు వ్యవసాయ శాస్త్రవేత్తగా, కాంపౌండర్ కూతురు డాక్టర్ చదవగలుగుతున్నారంటే ముమ్మాటికీ జగనన్న వల్లే అనడంలో ఎలాంటి సందేహం లేదన్నా రు. గతంలో చంద్రబాబు ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లో కోతలు పెట్టి విద్యను పేదలకు ఏ విధంగా దూరం చేశారో ప్రజలకు తెలుసునని అన్నారు. చంద్రయాన్ - 3 ప్రయోగాన్ని ప్రభుత్వ స్కూల్స్‌లో పిల్ల లు చూసే అవకాశం కల్పించడం, పాఠశాలల్లో ద్విభాషా టెక్ట్స్ బుక్స్ ను ప్రధాని మోదీ ప్రశంసించడం... జగనన్న వల్లే సాధ్యమైం దన్నారు. బటన్ నొక్కుతున్నారంటూ కొంత మంది జగనన్నను ఎగతాళి చేస్తున్నారని, ఒక్క బటన్ నొక్కితే పేదలను లంచం నుంచి విముక్తి చేస్తూ డైరెక్ట్‌గా వారి అకౌంట్‌కు డబ్బులు జమ అవుతున్నా యని, ఆ ఒక్క బటన్ పేదల ఆత్మ గౌరవం నిలుపుతోందని తెలిపా రు. కులం, మతం, ప్రాంతం చూడని పరిపాలనను అందిస్తుందని, లబ్ధిపొందిన వారు ప్రతిక్షాలకు భవిష్యత్ లేకుండా చేస్తారన్నారు.



### చంద్రబాబు, పవన్‌లకు విద్యాదీవెన ఇవ్వాలి

చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లకు విద్యాదీవెన పథకం వర్తింప చేయాలని మంత్రి రోజా ముఖ్యమంత్రి జగన్‌ను కోరారు. ఒక ఇంటర్వ్యూలో తాను ఇంటర్‌లో సిఇసి గ్రూప్ చదివానని, మరొకసారి హెచ్ఈసి, ఇంకొకసారి ఎంపీసీ అని పవన్ కల్యాణ్ తాను ఏం చదివాడో తనకే తెలీకుండా స్టేట్‌మెంట్‌లు ఇస్తున్నారని తెలిపారు. చంద్రబాబు మాత్రం ఇంజనీరింగ్ చదవాలంటే ఇంటర్‌లో బైపీసీ గ్రూప్ తీసుకోవాలని చెప్పారన్నారు. అందువల్ల వీరిద్దరికీ విద్యాదీవెన వర్తింపచేయాలని తెలిపారు. అయితే వీరిద్దరికి విద్యా దీవెన వర్తింప చేయాలంటే ఏపీలో వారికి ఇల్లు, ఓటు లేదు... కనీసం ఆధార్ కార్డు కూడా లేనందున సీఎంగా మీ ప్రత్యేకాధికారులు వినియోగించి వారిద్దరికి విద్యా దీవెనతో మంచి చదువు చెప్పించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. పవన్‌కల్యాణ్ పిచ్చి పిచ్చి మాటలతో ఊగిపోతూ జారిపోతూ, చంద్రబాబునాయుడు మరచిపోతూ రాష్ట్రంలో ప్రజలను విసిగిస్తున్నారన్నారన్నారు. అందువల్ల వీరికి ఆరోగ్యశ్రీ కింద కూడా ఉచిత వైద్యం అందించాలని సిఎంను కోరారు. టీడీపీని నమ్ముకుంటే విద్యార్థులు జైళ్ళకు వెళ్తారని, పవన్‌ను నమ్ముకుంటే సినిమా రిలీజ్‌లకు వెళ్లారని, కానీ జగనన్నను నమ్ముకుంటే మంచి కాలేజీలకు, యూనివర్సిటీలకు వెళ్లి జీవితంలో చక్కగా సెటిలవుతారని పేర్కొన్నారు. 2019 ఎన్నికల తర్వాత పంచాయతీ, మునిసిపాలిటీ ఇలా ఏ ఎన్నికలైనా వార్ వన్ సైడ్ అని తెలిపారు.

### జగన్‌ను ఓడించాలంటే జగనే రావాలి

జగనన్నను కొంత మంది ఓడిస్తామని, కొంత మంది ఆడిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని అయితే జగనన్నను ఓడించాలంటే ఆ పక్కన కూడా జగనన్నే వుండాలని, జగనన్నను ఆడించాలంటే ఆ పక్కన కూడా జగనన్నే వుండాలని తెలిపారు. పవన్‌కల్యాణ్ టైమ్ పాస్ రాజకీయాలు చేస్తూ షూటింగ్ గ్యాప్‌ల్లో వచ్చి ప్యాకేజీలు తీసుకుని మాట్లాడతారని, అందుకే ఎమ్మెల్యేగా కూడా గెలవలేకపోయారని తెలిపారు. చంద్రబాబు, పవన్, లోకేష్, ఊరూరా తిరుగుతూ విమర్శలు చేస్తున్నారని చెబుతూ... ఇటీవలే విడుదలైన జైలర్ సినిమాలో రజనీకాంత్ చెప్పిన " మొరగని కుక్క లేదు, విమర్శించని నోరు లేదు ఈ రెండు లేని ఊరే లేదు " అనే డైలాగ్‌ను గట్టిగా తెలుగు, తమిళ బాషల్లో చెప్పారు. పవన్ ఎంత విమర్శించినా, లోకేష్ ఎంత మొరిగినా చంద్రబాబు ఎన్ని అబద్ధాలు చెప్పినా 2024 ఎన్నికల్లో జగనన్న వన్స్‌మోర్ అని ప్రజలు పట్టం కట్టి 175 సీట్లు ఇవ్వడానికి రెడీగా వున్నారని తెలిపారు. చంద్రబాబు భవిష్యత్‌కు గ్యారెంటీ అంటూ కొత్త స్కీమ్‌తో బయలుదేరారు. మనకు రియల్ హీరో జగనన్న ఉండగా రీల్ హీరోలు అవసరం లేదని, వైకాపా కుటుంబ సభ్యులంతా ఎన్నికల వరకు సైనికులుగా పని చేస్తూ ప్రతిపక్షాల తప్పుడు ప్రచారానికి పుల్‌స్టాప్ పెట్టాలని



నగరిలో విద్యా దీవెన విడుదల చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

## మరమగ్గాలకు విద్యుత్ బిల్లులపై డ్యూటీ రద్దు

పుత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త :

నగరి నియోజకవర్గంలోని వేలాది మంది కార్మికులు ఆధారపడి జీవించే మరమగ్గాలకు వచ్చే కరెంట్ బిల్లులపై డ్యూటీ రద్దు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రకటించారు. సోమవారం నగరి పట్టణంలో జరిగిన బహిరంగ సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు పట్టణంలో వేలాది కుటుంబాలు మరమగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. ప్రత్యేకించి విద్యుత్ సబ్సిడీ లేకపోవడం వల్ల మరమగ్గాలకు వస్తున్న విద్యుత్ ఛార్జీలు భారంగా పరిణమించాయని తెలిపారు. దీనికి సంబంధించి వారికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. అలాగే తన నియోజకవర్గంలో వున్న వేణుగోపాలసాగర్, వేపగుంట, అడవికొత్తూరు రిజర్వాయర్లను ఆధునికీకరించాలని కోరారు. వీటిని సాగు నీరు సరఫరా చేసే గాలేరు-నగరి ప్రాజెక్టు పనులు చేపట్టాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సిఎం స్పందిస్తూ కరెంట్ ఛార్జీలపై డ్యూటీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే గాలేరు - నగరి పనులు, మూడు రిజర్వాయర్ల పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. రేణిగుంట మండలంలో వున్న ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ (గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీ) ఉద్యోగ, కార్మికుల వేతనాల బకాయిలకు సంబంధించి 21 కోట్లు విడుదల చేశారు.

## శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ





తిరుమల, ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:

దేవదేవుడికి జరిపించే పవిత్రోత్సవాల్లో రెండవరోజు సోమవారం ఆలయంలోని మూలవిరాట్‌తోబాటు ఉత్సవమూర్తులకు ఉప ఆలయాల్లోని దేవుళ్ళకు పవిత్రాలు సమర్పించారు. ఆలయమాఢవీధుల్లో ఊరేగింపుగా పవిత్రాలను ఆలయంలోనికి చేర్చారు. శాస్త్రోక్తంగా జరిపించిన ఈ వేదోక్తంలో సంపంగిప్రాకారంలో వేడుకగా ఉత్సవమూర్తులకు సుగంధద్రవ్యాలతో స్నపనతిరుమంజనం జరిపించారు.

## వైభవంగా ధ్వజావరోహణం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పుత్తూరురూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో శ్రీ ద్రౌపదీ దేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు(తిరుణాళ్లు) ధ్వజావరోహణంతో ముగిసింది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఉదయం అగ్నిగుండం శాంతి పూజ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం దేవస్థానం(కోవిల్ కార్ల ద్వారా) నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా రాచపాళెం గ్రామానికిచెందిన మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎస్.బాలసుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 9 గంటలకు వేద పండితులచే ధ్వజావరోహణం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్, మున్సిపల్ కౌన్సిలర్ ఏకాంబరం, పాలకమండలి సభ్యులు డి.ముకుంద ప్రకాష్, ఎం.సెల్వరాజ పెళ్లె, పి.మునిరాజ, కె.లక్ష్మిసుద, కె.నిర్మల, వి.మహాదేవి, పూజారి సి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.







సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, రామ్‌కుమార్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత

## కొడుకును హత్య చేసిన తండ్రి అరెస్ట్

దొరవారిసత్రం, ఆగస్టు 28 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండలం పడమటికండ్రిగ గ్రామానికి చెందిన పుట్టమనేని వెంకటకృష్ణయ్యను ఆదివారం అరెస్టు చేసినట్లు నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య సోమవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన పడమటికండ్రిగ గ్రామానికి చెందిన పుట్టమనేని వెంకటేశ్వర్లును తండ్రి వెంకటకృష్ణయ్య రోకలి బండతో తలపై కొట్టి హత్య చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకొని విచారణ చేపట్టి నిందితుడు పుట్టమనేని వెంకటకృష్ణయ్యను అరెస్టు చేసి సూళ్లూరుపేట కోర్టులో హాజరుపరిచినట్లు విలేఖరులకు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిఐ సోమయ్య, ఎస్ఐ జె.తిరుమలరావు, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, పిసిలు రామకృష్ణ, రాఘవరాజు, అమరనాథ్‌లను డిఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

## ప్రజ్ఞాన్ రోవర్‌కు తప్పిన ప్రమాదం



శ్రీహరికోట (తడ), ఆగస్టు 28, ప్రభాతవార్త

జాబిల్లి పై పరిశోధనలు చేస్తున్న మన ప్రజ్ఞాన్ రోవర్ ప్రమాదం నుండి తప్పించుకుంది. సోమవారం ఇస్రో ప్రకటన ప్రకారం ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. రోవర్ చందమామ దక్షిణ ధృవం పై పరిశోధనలు చేసే క్రమంలో నిదానంగా తిరుగుతోంది. అప్పుడు దాని ముందు నాలుగు మీటర్ల వెడల్పు ఉన్న బిలం ఉన్నట్లు గుర్తించింది. రోవర్లో అమర్చిన నావిగేషన్ ఈ బిలాన్ని గుర్తించడంతో ప్రజ్ఞాన్ మరో మార్గంలో ప్రయాణం ప్రారంభించింది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ వివరాలు ట్విట్టర్‌లో తెలియజేశారు.

## నామం పెట్టు కాసులు కొట్టు

### దేవస్థానం వేదికగా వేలాది కుటుంబాలకు ఉపాధి

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం వేదికగా వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశం, ఆదాయాలు లభిస్తున్నాయి. కొందరు దళారులుగా అవతారమెత్తి భక్తులను దోపిడి చేస్తుండగా ధార్మిక చింతన కల్గిన కొందరు భక్తులను గైడ్ చేస్తూ కాసులు సంపాదించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రక రకాల వ్యాపారాలు చేసుకుంటున్న వారు కొందరైతే మరి కొందరు కొత్త మార్గాన్ని అన్వేషించుకుంటూ భక్తులను ఆకట్టుకుంటూ వారి నుంచి కాసులు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆలయప్రవేశ ద్వారాల వద్ద కొందరు 'నామం పెట్టు కాసులు కొట్టు' అన్నట్లు ఉపాధిగా మలచుకున్నారు. వీరు పార్కింగ్‌ల వద్ద నిలబడి బొట్టుపెడతామంటూ అభ్యర్థించటం పలువురిని ఆకర్షిస్తుంది. భక్తిభావంతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన వారు బొట్టుపెడతామంటే కాదనలేకపోతున్నారు. బొట్టు సంప్రదాయానికి సూచికం. అంతేకాక స్వామి అమ్మవార్ల దర్శనానికి వెళ్లె ముందు బొట్టు పెడతామంటే ఎవరు కాదనగలరు? అయితే ఎంతో చక్కగా తెల్లటి నామకుంతో శివలింగాన్ని పోలిన బొట్టును పెడుతున్నారు. బొట్టుపెట్టిన తరువాత 'మీదయ బాబు' అంటున్నారు. డిమాండ్ చేయటం లేదు. దాంతో కొందరు తమకు తోచిన విధంగా రూ.5,10 అందిస్తున్నారు. ఇలా ఒక్కొక్కరు మూడు నుంచి ఐదువందలు సంపాదించుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఏ పని లేని వారికి ఇదో ఉపాధిగా మారింది. ఇలా ప్రతి గేటు వద్ద బొట్ట పెట్టు వారు దర్శనమిస్తున్నారు. అయితే ఇదో ఆకర్షణీయంగా ఉంది. బొట్టు పెట్టిన తరువాత డిమాండ్ చేయక వారికితోచినది అందించగా తీసుకుంటున్నారు. తృప్తి చెందుతున్నారు. అంతేకాక ఇటీవల కాలంలో తేరువీధి ఆలయ పరిసరాల్లో ప్రతి ఒక్కరు బొట్టుతో దర్శనమిస్తున్నారు. ఇది ఎంతో అందంగా ఉంటుంది. ఇక కొందరు దుకాణదారులు పత్రి, పసుపు దారాలు మరి కొందరు దర్శనం అంటూ రక రకాల సంపాదనలతో ముందుకువెళుతున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం పరిసరాలు ప్రధాన ఉపాధి కేంద్రాలుగా మారి వారి కుటుంబాలను పోషించుకోవటమే కాకుండా వారి బిడ్డలను ఇంజనీర్లు, డాక్టర్లు చదివించుకుంటున్నారంటే దేవాలయం వల్ల ఎన్ని వందల కుటుంబాలకు ఉపాధి కల్గుతుందో అర్థమౌతుంది. ప్రస్తుతం 'బొట్టు పెట్టు కాసులు పట్టు' అన్నది కొత్త ఉపాధిగా చెప్పవచ్చు. కొంత కాలానికి దేవస్థానం దీనిని కూడా టెండర్ పెట్టిని ఆశ్చర్యపోక్కర్లేదు.

## మృత్యుంజయ అభిషేకాలు

# భక్తులతో కళ కళ

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. దాంతో శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. కాగా ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబడుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతుదోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం, మృత్యుంజయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది.

### మృత్యుంజయునికిషోడషాభిషేకాలు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారంప్రత్యేకాభిషేకాలు ,అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. ఇక్కడి మృత్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లుతున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు, గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయమానంగా అలంకరించి ధూప, దీపనైవేద్యాలను మహా మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నిరంజన స్వామి సారధ్యంలో షోడషాభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఏర్పాట్లను ఎఇఓ సతీష్‌మాలిక్, లోకేష్‌రెడ్డి, హరియాదవ్, సుదర్శనం, నాగభూషణం పర్యవేక్షించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం



# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

## - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త: అర్హులైన వారందరికీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ లాలుగార్డెన్ గుండాలమ్మ గుడిలో ఆదివారం పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా! లేదా! అని అడిగి తెలుసుకొన్నారు. పథకాలకు అర్హత వుండి మంజూరు కాకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. స్థానికులు మురికి కాలువలు, సిమెంటు రోడ్లు, తాగునీరు, వీధి దీపాల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటిని పరిశీలించి సత్వరం మంజూరు చేస్తామని ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుష్మ, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, కో-అప్షన్ సభ్యుడు కోలా కిరణ్, వైకాపా నాయకులు రియాజ్‌భాషా, ప్రకాష్, అంజాద్, నారాయణ, షఫీన, మునీర్, గౌస్, మహబూబ్‌భాషా, అల్తాఫ్, అస్లాం, బాబ్జి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రెవిన్యూ భవన్‌లో మాతృభాష దినోత్సవ వేడుకలు

చిత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణం, రెవిన్యూ భవనం నందు సోమవారం నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కరణం విమల ఆద్వర్యంలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జీ కరుణకుమార్ మాట్లాడుతూ మన మాతృభాషా దేశభాషల నందు ఎంతో గొప్పదనీ, అలాంటి మాతృభాషను మరచిపోకుండా, కాపాడుకోవాలని కోరారు. అనంతరం అధ్యక్షురాలు కరణం విమల మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహిస్తూ పలు సేవా కార్యక్రమాలను సంఘం ఆద్వర్యంలో నిర్వహిస్తున్నామని అలాగే తెలుగుభాషాభివృద్ధికి కృషి చేసిన సేవకులను సన్మానించడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనివర్శిటీ డీన్ సునీల్‌కుమార్, ట్రాన్స్‌కో ఇఇ పద్మనాభపిళ్లైలతో పాటు సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నాణెం ముద్రణపై హర్షం

బంగారుపాళ్యం, ఆగస్టు 28 ప్రభాతవార్త:



భారతదేశం గర్వించదగ్గ స్వర్గీయ ఎన్టీఆర్ స్మారక చిహ్నంతో వంద రూపాయల నాణెం ముద్రించడం అభినందనీయమని మండల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన్‌గౌడ్‌లు విలేకరులతో మాట్లాడుతూ దేశంలో తెలుగుజాతి గౌరవంను ఎన్టీఆర్ నిలిపారని అందుకుగాను భారత ప్రభుత్వం స్మారక చిహ్నంతో నాణెంను ముద్రించడం జరిగిందన్నారు. నటనా, రాజకీయ పరంగా విశేష పేరు ప్రతిష్టలను ఎన్టీఆర్ గడించారని వారు గుర్తు చేశారు. అలాగే స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కలమనాధరెడ్డి, లోకనాధనాయుడు, రమేష్, నాసిర్, రాధాకృష్ణ, జాకీర్, దేవయాని, కుమారి, శివ తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం స్పందన అర్జీలకు పరిష్కారం

### - కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త: సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 2, ప్రజారోగ్య విభాగంకు సంబంధించి ఒక సమస్య ప్రజల నుండి అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ డాక్టర్ గోవర్ధన్, ఎంఇ వెంకటప్రసాద్, ఎసిపి రామకృష్ణుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ

కుప్పం, ఆగస్టు 28 ప్రభాతవార్త తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్‌ఎం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. బికాం(సిఎ)లో శ్వేత, బిబిఎలో శాన్విక, అత్యధిక మార్కులతో కుప్పం పట్టణ టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే సుల్తానా, నిత్యశ్రీ, అనిత, సత్యవాణి, రిషిక, ప్రియాంక, పూజిత అనే విద్యార్థినులు సైతం ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులను ఛైర్మన్ ఘనంగా సత్కరించారు. అధ్యాపకులను అభినందించారు.

## ఎన్‌సిసి కేడెట్లకు సర్టిఫికెట్లు పంపిణీ



కుప్పం, ఆగస్టు 28 ప్రభాతవార్త ద్రవిడ వర్సిటీలో ఎన్‌సిసి బి కేటగిరీలో అర్హత సాధించిన 31మంది కేడెట్లకు రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బి కేటగిరీకి వర్సిటీ తరపున 31మంది హాజరై వందశాతం అర్హత సాధించడం పట్ల అభినందించారు. కాగా కేంద్రం నియమించే అగ్నివార్ ఆర్మీకి సంబంధించి వర్సిటీ తరపున 5మంది అర్హత సాధించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎన్‌సిసి కేడెట్లకు వివిధ రిక్రూట్‌మెంట్లలో అదనపు మార్కులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో సిటిఓ డా॥ శ్రీప్రియ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్

కుప్పంరూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్ పేర్కొన్నారు. సోమవారం మల్లానూరులో ప్రభుత్వం రైతులకు ఎనభై శాతం రాయితీతో అందిస్తున్న ఉలవల పంపిణీని ఆయన ప్రారంభించారు. వేరుసెనగ సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయంగా ఉలవల సాగు చేయాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎఓ అమృతవల్లి, ఎఇఓ ఔరంగ్ మాట్లాడుతూ అన్ని ఆర్‌బికెల పరిధిలో రైతులకు అవసరమైన ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఫీజు రీఎంబర్స్‌మెంట్లలో సిఎం జగన్‌రెడ్డి కోతలు

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



శాంతిపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త విద్యార్థులకు ఫీజురీఎంబర్స్‌మెంట్లలో సిఎం జగన్‌రెడ్డి కోతలు విధిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆరోపించారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత తెదేపా పాలనలో 16 లక్షల మందివిద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ చేస్తే వైకాపా పాలనలో కేవలం 9.32లక్షల మందికి అందిస్తున్నారన్నారు. ఏటా విద్యార్థుల సంఖ్య నిబంధనల పేరిట తగ్గిస్తున్నారన్నారు. దీంతో చాలామంది విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. విద్యాదీవెన 2023-24కు రెండు విడతలు మాత్రం కేటాయించారన్నారు. ప్రభుత్వం సకాలంలో ఫీజులు చెల్లించకపోగా విద్యార్థులకు యాజమాన్యాలు నోటీసులు ఇవ్వడం పరీక్షలు రాయకుండా చేస్తున్నాయన్నారు. వైకాపా పాలనలో 9602స్కూళ్లు మూసేశారన్నారు. పేద విద్యార్థులను విద్యకు దూరం చేశారన్నారు. కార్యక్రమంలో జనార్ధనరెడ్డి, మణి, చంద్రశేఖర్, సుగుణమ్మ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలి

### - హిందు ధర్మపరిరక్షణ సమితి



కుప్పంరూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త మండలంలోని నూలుకుంట జడ్పీహైస్కూల్‌లో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు ఆగస్టు 15న జాతీయ జెండా పట్టుకుని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారని అతనిపై తగు చర్యలు తీసుకోవాలని హిందు ధర్మ పరిరక్షణ సమితి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎంను కలసి వినతిపత్రం అందించారు. సదరు ఉపాధ్యాయుడు మతపరమైన అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ ఆకర్షించే యత్నాలు చేస్తున్నారన్నారు. సంబంధిత ఉపాధ్యాయుడిపై తగు చర్యలు తీసుకోవాలని ఈ విషయంగా నేషనల్ హ్యూమన్ రైట్స్‌కు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు నరేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

నగరి, ఆగస్టు 28 ప్రభాతవార్త : విద్యాదీవెన పథకం అమలులో భాగంగా సోమవారం నగరి పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఉదయం 10.30 గంటలకు నగరి మండలం కీళపట్టు హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రికి పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా భర్త సెల్వమణితో కలిసి స్వాగతం పలికారు. అలాగే ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, సంక్షేమ శాఖ మంత్రి ఉషా శ్రీచరణ్, పర్యాటక మంత్రి రోజా, రాష్ట్ర ఆర్టీసీ వైస్‌ఛైర్మన్, విజయానందరెడ్డి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి, మిధున్‌రెడ్డి, ఎన్.రెడ్డెప్ప, డీఐజీ అమ్మిరెడ్డి, జిల్లా కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భరత్, ఎమ్మెల్యేలు సత్యవేడు,





పూతలపట్టు, పలమనేరు ఆదిమూలం, ఎన్.వెంకటేష్ గౌడ్, ఎం.ఎస్.బాబు, నగరి మున్సిపల్ ఛైర్మన్ నీల మేఘం, తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి బొత్స సత్యనారాయణ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. కీళపట్టు హెలిప్యాడ్ నుంచి బస్సులో రోడ్‌షో ద్వారా నగరి పట్టణ ప్రజలకు అభివాదంచేస్తూ బహిరంగ సభకు చేరుకున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నానో , జీవన ఎరువుల వాడకంతో సాగు ఖర్చులు తగ్గుతాయి

### - జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య



బాలాయపల్లి, ఆగస్టు 28, ప్రభాతవార్త: పంటలకు నానో మరియు జీవన ఎరువుల వాడకంతో సాగు ఖర్చులు తగ్గి రైతులకు అధిక ఆదాయం వస్తుందని వ్యవసాయ శాఖ తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. బాలాయపల్లి మండలం, నిడిగల్లు గ్రామంలో ఆత్మ సహకారంతో ఏర్పాటు చేసిన రైతు శిక్షణలో ఆయన మాట్లాడారు. రైతులు భూములకు వేసే ఎరువుల్లో 20 నుండి 30 శాతం మాత్రమే పంటలు వినియోగించుకుంటాయన్నారు. మిగతా లోపలి పొరల్లో వాతావరణంలో కలిసిపోయి నేలను, వాతావరణాన్ని కాలుష్యం చేస్తుందని వివరించారు. ఈ సమస్య నివారణకు నానో ఎరువులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ద్రవ రూపంలో ఉండే ఈ ఎరువులు అర్ధలీటరు ఒక బస్తా ఎరువుకు సమానమన్నారు. వీటిన ఎరువుల వృధా తగ్గి రైతుకు అధిక ఆదాయం వస్తుందన్నారు. ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ సహకార రంగంలో అతి పెద్ద ఎరువుల ఉత్పత్తి సంస్థ అన్నారు. ప్రపంచంలోనే మొదటిసారి నానో ఎరువులు అందిస్తున్నామని, దీంతో పాటు జీవన ఎరువులను కూడా రైతులకు ఇఫ్కో అందజేస్తుందన్నారు. రాబోవే రబీ వరి సాగు పద్ధతుల గురించి ఏవో వేణుగోపాలరావు రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ పథకాల గురించి మండల వ్యవసాయ అధికారిణి శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సబ్ - డివిజనల్ టెక్నికల్ ఏవో వరప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సుధాకర్, ఎంపీటీసీ దశరథరామిరెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకురాలు సుమతి, రైతులు పాల్గొన్నారు.

## 1 నుంచి ఎండియు వాహనాలు బంద్

కోట, ఆగస్టు 28 ప్రభాతవార్త ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాలు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి బంద్ చేయనున్నట్లు ఎండియు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు ఏడుకొండలు చెప్పారు. ఆ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి ప్రతి కార్డుదారుడి నుంచి రెండుసార్లు వేలిముద్రలు తీసుకోవడం, రెండుసార్లు తూకం వేయడం వల్ల సర్వర్లు మొరాయించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని చెప్పారు. ప్రజాపంపిణీ వ్యవస్థ మీద ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ఎండియు ఆపరేటర్లు, హెల్పర్లపైన దాడులు జరిగాయని చెప్పారు. ఆర్థిక భారం కూడా తోడవడంతో తాము ఇంటింటికి సరఫరా చేయలేమని స్పష్టం చేశారు. పెరిగిన పెట్రోలు, నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఉద్యోగ భద్రత, అనారోగ్యం బారిన పడినప్పుడు ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం చేయడానికి హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. 2021 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు 1వ తేదీ నుంచి తాము సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

## ఖాజీపై చర్యలు తీసుకోవాలని ముస్లింల ధర్నా




వెంకటగిరి, ఆగస్టు 28, ప్రభాతవార్త: ముస్లింలకు పెళ్ళిళ్ళు నిర్వహించే ఖాజీ సయ్యద్ సైకో ఖాదరిపై చర్యలు తీసుకోవాలని ముస్లిం సోదరులు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఖాజీ ఆగడాలపై తహసీల్దారు పద్మావతికి ముస్లింలు ఫిర్యాదు చేశారు. ఖాజీ పెళ్ళిళ్ళకు ప్రభుత్వ నిబంధనలు కాకుండా ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. పేదలు ఇచ్చుకోలేని స్థితిలో ఉన్న వారిని ఇబ్బంది పెడుతున్నట్లు చెప్పారు. ఖాజీపై అధికారులు విచారణ చేసినా ఫలితం లేదన్నారు. వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు.

## అపరిచితుల పట్ల ప్రజలు ప్రత్యేక నిఘా పెట్టాలి

దొరవారిసత్రం, ఆగస్టు 28 ప్రభాతవార్త ఎవరైనా అపరిచితుల పట్ల అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని దొరవారిసత్రం ఎస్ఐ జె.తిరుమలరావు కోరారు. సోమవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నాయుడుపేట డివిజన్ పరిధిలో గత కొంతకాలం నుంచి రోడ్డుపై నడిచి వెళుతున్న మహిళల మెడలో బంగారు గొలుసులు, ఆభరణాలు లాక్కెళుతున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ముఖ్యంగా గ్రామాల్లోని ప్రజలు సహకరిస్తే ఎక్కడ కూడా దొంగతనాలు, నేరాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఎవరైనా దూరప్రయాణాలు చేసే వారు తమ ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలు, డబ్బులు ఉంచవద్దని సూచించారు. అపరిచితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా మహిళలు, చిన్నచిన్న వస్తువులు అమ్మేవారు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## 5 నుంచి 18 ఏళ్లలోపు బాలబాలికల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



కోట, ఆగస్టు 28 ప్రభాతవార్త క్షేత్రస్థాయిలో ఐదు నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఇఓ-2 మస్తానయ్య కోరారు. సోమవారం స్థానిక ఎంఇఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిఆర్ ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఇంకా బడిలో చేరని, నమోదు కాని విద్యార్థులను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో ప్రతిరోజు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లను సమన్వయం చేసుకొని జీవిఆర్ వందశాతం జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన అవసరం

సూళ్లూరుపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త



ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు ఏదైనా వస్తువును కొనుగోలు చేయాలంటే దానిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని బాలికల హైస్కూల్ కన్సూమర్స్ క్లబ్ కో-కోఆర్డినేటర్ ఎన్.జానకి అన్నారు. సోమవారం హైస్కూలు ఆవరణలో నిర్వహించిన కన్సూమర్స్ క్లబ్ సమావేశంలో ఆమె విద్యార్థులను కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులు వస్తువుల కొనుగోలులో వ్యాపారుల నుంచి నాణ్యత ప్రమాణాలతో పాటు దాని బరువు, మానుఫ్యాక్చరింగ్, ఎక్స్‌పైరి డేట్లు చూసి కొనుగోలు చేయాలన్నారు. ప్రతి నెలలో ఒకరోజు వినియోగదారుల క్లబ్‌ను హైస్కూల్‌లో నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.శేఖర్ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు.

## క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వాణికి ఆర్థిక సహాయం



చిల్లకూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన పొటేళ్ళ వాణి అనే వివాహితకు గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుండగా చేడిమేల గ్రామానికి చెందిన రాజానేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసులు నాయుడు దృష్టికి రావడంతో వెంటనే మద్రాసులోని క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్య నిమిత్తం ట్రస్టు ద్వారా 30 వేల రూపాయిలు ఆర్థిక సహాయాన్ని ట్రస్టు సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ రాజానేని పిచ్చయ్యనాయుడు, ట్రస్టు సభ్యులు బాబు, భాస్కర్‌లు చెన్నై క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్ళి వాణి పరిస్థితి తెలుసుకుని ఆర్థిక సహాయం అందించారు.

## ఇసుక డంపింగ్ వద్ద టిడిపి నిరసన



కోట, ఆగస్టు 28 ప్రభాతవార్త కోట మండలం కేశవరం పంచాయతీలోని కొండుగుంట గ్రామానికి సమీపంలో ఇసుక డంపింగ్ యార్డు దగ్గర గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. భావితరాల ప్రజల కోసం తాము పోరాటం చేయకతప్పదన్నారు. ఇసుకను ఎక్కడపడితే అక్కడ తవ్వేయడం వల్ల భూగర్భజలాలు ఎండిపోయి స్వర్ణముఖి నది చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయని చెప్పారు. టన్ను ఇసుక ధర రూ.475లకే విక్రయిస్తున్నట్లు చెప్తూ అక్రమంగా దోచేస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్క లారీలు 22 టన్నుల వరకు ఇసుక తరలి వెళుతుందని ఆరోపించారు. ఎక్కడా నిబంధనల మేరకు సిసి కెమెరాల పర్యవేక్షణలో జరగడం లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి, పార్లమెంటు అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పార్లమెంటు మైనార్టీ సెల్ నాయకులు జలీల్ అహ్మద్, బిసి సెల్ నాయకులు తీగల సురేష్‌బాబు, ఎంపిటిసిలు షంషుద్దీన్, దారా సురేష్, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కట్టా వెంకటరమణారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే సంజీవయ్య



నాయుడుపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఇటీవల గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న కట్టా వెంకటరమణారెడ్డి తన స్వగ్రామంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన తర్వాత ఆసుపత్రికి వెళ్లాలని భావించారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయన చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. అపోలో వైద్యులు కట్టా వెంకటరమణారెడ్డికి హార్ట్ సర్జరీ చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైసీపీ నాయుడుపేట మండల అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణయంరెడ్డిలు రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తర్వాత చెన్నై అపోలో ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకుని ఉన్న కట్టా వెంకటరమణారెడ్డిని పరామర్శించారు. అపోలో వైద్యులతో కట్టా వెంకటరమణారెడ్డి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు



దొరవారిసత్రం, ఆగస్టు 28 ప్రభాతవార్త దొరవారిసత్రం మండలం నెలబల్లి 149 పోలింగ్ కేంద్రం, ఏకొల్లులోని 160, అక్కరపాకలోని 171, తనయాలి 169 తదితర పోలింగ్ కేంద్రాలను ఎన్నికల స్పెషలాఫీసర్‌తో పాటు జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసాద్‌రావు సోమవారం తనిఖీ చేశారు. ఓటరు లిస్టులో ఉన్న మరణించిన వారు, మరో ప్రాంతానికి వెళ్లిపోయిన వారి వివరాలు, డబుల్ ఎంట్రీల ఓటర్ల వివరాలు ప్రత్యేకంగా పరిశీలించారు. గ్రామాల్లోని కొన్ని ఇళ్లకు వెళ్లి ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు తహశీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపిడిఓ శింగయ్య ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## గిరిజనులకు గుర్తింపు ఒక్క దేశంతోనే సాధ్యం



శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 28 ప్రభాతవార్త : సమాజంలో గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చింది, ఇవ్వబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే అని తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మీ ఆశీర్వాదం కోసం మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా మున్లిపేడు గ్రామ పంచాయతీల్లోనూ, బత్తినయ్య కాలనీలో పర్యటించారు.కాలనీల్లోని ఇంటింటికి వెళ్ళి గతంలో తెలుగుదేశం ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి చేపట్టిన పథకాలు వివరించారు. భూముల పంపిణీ కాలనీల ఏర్పాటు చేసామన్నారు.సుధీర్‌రెడ్డి గ్రామానికి వచ్చినపుడు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు మేళ తాళాలు,తప్పెట్ల మోతతోపూల వర్షం కురిపిస్తూ స్వాగతించారు.ఈ సందర్భంగా ఒక్క చాన్సు కోరిన నాయకుడు నిరుపేదలు గిరిజన దళితుల హక్కులను ఎలా కాలరాసింది?అలాగే నేడు ధరల దరువుతో జనం తల్లడిల్లుతున్న వాస్తవాల్ని వివరిస్తూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు విడుదల చేసిన మినిమెనిఫేస్టోలో మహిళలు, విద్యార్థులు, రైతులకు అందించిన వెసులుబాట్లను వివరించారు.రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమే అని వివరించారు. గోపాలన్న రాజ్యం రావాలంటే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఎంఎల్ఏగా గెలిపించుకోవాలని నాయకులు పిలుపు నిచ్చారు.రాబోవు ఎన్నికల్లో మీ ఓట్లను మీకు తెలియకుండా వేయటానికి అధికార పక్షం ప్రయత్నిస్తుందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలుగుదేశంప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజనుల హక్కులను వారికి అందించటంలో మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు.అ కార్యక్రమాల్లో మండల నాయకులు కామేష్‌యాదవ్,రంగినేనిచెంచయ్యనాయుడు, ధనంజయులు నాయుడు,నాగరాజనాయుడు,మల్లికార్జున్ నాయుడు,విజయకుమార్ నాయుడు మాజీ మండలాధ్యక్షులు నాగమణి,కన్నలి ప్రతాప్‌రెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

శ్రీకాళహస్తిరూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల వద్ద హోమాలు నిర్వహించారు.ఆలయ సంప్రదాయం మేరకు టిటిడి సూచించిన మేరకు పవిత్రోత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ నేపధ్యంలో సోమవారం కార్యక్రమాలకు పట్టణానికి చెందిన మాజీ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాజుల సత్యనారాయణ హాజరైపూజలు జరిపించుకున్నారు. కార్యక్రమాలు టెంపుల్‌ఇన్స్పెక్టర్ రవిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు.అర్చకులు రమణస్వామి, బాబు స్వామి, సదాశివస్వామి,జయస్వామిలు కార్యక్రమాలను నిర్వహించారు.

## కరాటే పోటీల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త : ఆదివారం నెల్లూరులో జరిగిన రాష్ట్ర కరాటే ఛాంఫియన్ షిప్ నందు శ్రీకాళహస్తి ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చూపి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ సి.మధుసూధన్‌రెడ్డి తెలిపారు. జూనియర్స్ విభాగంలో పి.సౌమిత, వి.పునర్విక, అమృత, సీనియర్స్ విభాగంలో బి.జోషి, రక్షిత్‌కమల్‌లు ప్రథమబహుమతిగా బంగారు పతకాన్ని సాధించారన్నారు. కాగా మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి సత్యవతి, అనిల్‌కుమార్, శిరీష, ప్రైమరీ ఇన్‌ఛార్జి ప్రశాంతి, శివ, వెంకటేష్, పద్మజ, బేగం, కుమారి, వెంకటేష్, దేవిశ్రీ, మోహన్, సునీత, శేషబాబు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి రూరల్ సిఐటియు మండల కన్వీనర్‌గా గండికోట

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 28 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ సిఐటియు మండల కన్వీనర్‌గా గండికోట నాగవెంకటేష్ ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి ఎస్వీ నగర్ నందుగల నల్లగంగమ్మ గుడి ఆవరణంలో సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. ఈ మహ సభకు ముఖ్య అతిధిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వర రావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా నాయకులు జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి. సాయిలక్ష్మి, అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణి శ్రీ, ఆప్కాస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చినబాబు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీలో కో కన్వీనర్లుగా మోహనమ్మ (అంగన్‌వాడీ), సత్యవేలు (గ్యాస్ డెలివరీ బాయ్స్), చెన్నకేశవులు (108 ఉద్యోగుల సంఘం), నీలకఠం (తిరుచానూరు), భీమా మునిరాజా (వెటర్నరీ యూనివర్సిటీ), కమిటీ సభ్యులు వరలక్ష్మి, రాఖీ, చంద్రమ్మ, రమా (వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం), భాష (ఆటో) శ్రీనివాసులు (టిటిడి ఫారెస్టు) బిల్డింగ్, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర రంగాల నుండి కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

## ఉచిత విద్యుత్‌కు జగన్ మంగళం..సిపిఎం

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రైతుల ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేలా ఉన్నారని సిపిఎం పట్టణ బాధ్యుడు గంధం మణి విమర్శించారు. విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సభను సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో నిర్వహించారు. అమరవీరులకు జోహర్లు అర్పించారు. చంద్రబాబు నిరంకుశ వైఖరి కారణంగా నాడు సిపిఎం కార్యకర్తలు విద్యుత్ పోరాటంలో అశువులు బాసారని మణి గుర్తు చేశారు. వారి ప్రాణత్యాగాల ఫలితమే చంద్రబాబు అధికారం కోల్పోయారని ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అందించారని గుర్తు చేశారు. అయితే ఆయన వారసుడుగా అధికారంలోకి వచ్చిన జగన్ చంద్రబాబుకు ఏమీ తీసిపోనట్లు నాలుగేళ్ళలో 8సార్లు విద్యుత్ ఛార్జీలుపెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్నారన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేందుకు కేంద్రంతో చేతులు కలిపి కుట్ర చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజలంతా ఒక్క తాటిపై జగన్ చేపడుతున్న విద్యుత్ సంస్థలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురవయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

## నానో, జీవన ఎరువుల వాడకంతో సాగు ఖర్చులు తగ్గుతాయి

**జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య**



తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 28 ప్రభాతవార్త : పంటలకు నానో, జీవన ఎరువుల వాడకంతోసాగు ఖర్చులు తగ్గి రైతులకు అధిక ఆధాయం వస్తుందని వ్యవసాయ శాఖ తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. బాలాయపల్లి మండలం, నిడిగల్లు గ్రామంలో ఆత్మ సహకారంతో ఏర్పాటు చేసిన రైతు శిక్షణలో ఆయన మాట్లాడుతూ రైతులు భూములకు వేసే ఎరువులలో 20 నుండి 30 శాతం మాత్రమే పంటలు వినియోగించుకుంటా యని తెలిపారు. మిగతా భూమి లోపలి పొరల్లో వాతావరణంలో కలిసిపోయి, నేలలను, భూగర్భజలాలను, వాతావరణాన్ని కాలుష్యం చేస్తున్నదని వివరించారు. ఈ సమస్య నివారణకు నానా ఎరువులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ద్రవ రూపంలో ఉండే ఈ ఎరువులు అర్ధ లీటరు ఒక బస్తా ఎరువుకు సమానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి సబ్ డివిజన్ టెక్నికల్ ఏవో వరప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సుధాకర్, ఎంపిటిసి దశరథరామిరెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి, ఆర్‌బికె వ్యవసాయ సహాయకురాలు సుమతి, రైతులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై తేదేపా నిరసన

సత్యవేడు, ఆగష్టు28, ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గంలో యదేచ్ఛగా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సోమవారం ఇన్‌ఛార్జ్ హెలెన్ ఆధ్వర్యంలో తేదేపా శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి.నాగలాపురం మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక డంపింగ్ యార్డు వద్దకు చేరుకుని, ఇసుక దోపిడిపై ధ్వజమెత్తారు. అధికార వైకాపా పాలనలో అక్రమ రవాణాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. పేదవాడి ఇంటి నిర్మాణానికి ఇసుక దొరకని పరిస్థితి ఉందన్నారు. వాస్తవానికి ప్రభుత్వ కాలనీలు, ప్రభుత్వ భవణ నిర్మాణాలు ఇసుక కొరత కారణంగా పునాదులతో కొన్ని, అర్థాంతరంగా కొన్ని నిర్మాణదశలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తేదేపా పార్లమెంట్ అధ్యక్ష్యుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే హేమలత నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని ఆదరించండి..!

**వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి**



రామచంద్రాపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త: అభివృద్ధిని చూసి మా అన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఒక్కసారి ఎంఎల్ఏ అభ్యర్థిగా ఆధరించాలని వైసిపి యువజన నాయ కుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కోరారు. సోమవారం చంద్రప్ప నాయుడు కండ్రిగ, పుల్లమ నాయుడు కండ్రిగ, పిళ్ళారికోన, నెత్త కుప్పం ఏఏ డబ్ల్యు వాడలో గడపగడపకు హర్షిత్ రెడ్డి కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్ళి వివరించారు. తుడా నిధులతో గ్రామాలు మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చినబాబు, ఎంపిటిసిలు మంజుల సిద్దారెడ్డి, ఎద్దల రాజేష్, మునీంద్ర యాదవ్, అనుప్పల్లి వైసిపి పంచాయతీ అధ్యక్షుడు సిరిపిరెడ్డి సతీష్ రెడ్డి, నాయకులు సాయిశశికాంత్, సిరిపిరెడ్డి కేశవులు రెడ్డి, చిరంజీవి నాయుడు, గజేంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పునరావృతం కాకుండా సమస్యలు పరిష్కరించాలి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 28 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థకు డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలకు వస్తున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా సకాలంలో పరిష్కరిం చాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో కమిషనర్ హరిత ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ముఖ్యంగా కార్పొరేటర్లు సూచించిన ప్రజాభివృద్ధి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వా లని కోరారు. కొన్ని డివిజన్‌లోని సమస్యలపై కార్పొరేటర్లు నేరుగా కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్‌కు 19 ఫిర్యాదులు, స్పందన కార్యక్రమానికి 20 ఫిర్యా దులు రావడం జరిగిందన్నారు. వచ్చిన అన్నీ ఫిర్యాదులపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసు కోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, డిఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజీవ్‌కుమార్, మహేష్, గోమతి, దేవిక, మేనేజర్ చిట్టిబాబు, సర్వేయర్ దేవానంద్, సూపరింటెండెంట్లు, ఆర్ఐలు,అధికారులు పాల్గొన్నారు.

**సబ్ రిజిస్ట్రార్ కాలనీ పార్కును అభివృద్ధి చేయాలి**

**-కమిషనర్‌కు కాలనీవాసుల విజ్ఞప్తి**

డంపింగ్ యార్డును తలపించేలా స్థానిక మంగళం సమీపంలోని సబ్ రిజిస్ట్రార్ కాలనీకి చెందిన పార్కు తయారయిందని,దీనిని వెంటనే అభివృద్ధి చేయాల్సిందిగా ఆ కాలనీ కమిటీ నాయకులు ఊట్ల సురేంద్రనాయుడు, కొల్లూరు బాలసుబ్రహ్మణ్యం, భాస్కర్, త్యాగరాజు, అనిల్ మున్సిపల్ కమిషనర్ హరితను కోరారు. సోమ వారం ఈ మేరకు ఆమెను తన ఛాంబర్ నందు కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాయంత్రమయితే పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు ఆకతాయిలు, మందుబాబులు పార్కును అడ్డాగా మార్చుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు.ఆ కాలనీలో పారిశుద్ధ్యం,వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని వాపోయారు.గతంలో ఒక అద్భుతంగా ఉన్న కాలనీలో నేడు చీకటి పడితే మహిళలు ఇంటి నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణం కమిషనర్ జోక్యం చేసుకుని పార్కును అభివృద్ధి చేసి,అక్కడ సిమెంట్ రోడ్లు,వీధి దీపాలు ఏర్పాటు చేయాలని,పార్కులో ఉన్న వ్యర్థాలనీ తీసివేసి అభివృద్ధి పరచాలని కోరారు.దీనికి సానుకూలంగా స్పందిన కమిషనర్..వెంటనే ఆ కాలనీని ఇన్స్‌పెక్షన్ చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## టీపిపిఎం హై స్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



తిరుపతి (విద్య), ఆగస్టు 28 ప్రభాతవార్త : తిరుపతిలోని టీపిపిఎం హైస్కూల్‌లో 1975-1976 మధ్య కాలంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమావేశం నిర్వహించారు. ఆనాటి విద్యార్థు లు దొరస్వామిరెడ్డి, దుర్గా వరప్రసాద్, వనం గౌరీ శంకర్, ఉదయభానుల నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడానికి స్థానికంగానే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని నాలుగున్నర దశాబ్దాల నాటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్ ఆనందకుమార్‌తో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు ముని రామయ్య, భారతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాము చదివిన స్కూల్‌కి రూ. 10 వేలు విలువైన ఫర్నిచర్‌ను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

## వర్క్ షాప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విసి రాజారెడ్డి

తిరుపతి (క్రీడ), ఆగస్టు 28 ప్రభాతవార్త : ఎస్వీయూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్, రేర్ ఎర్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా 23 సెప్టెంబర్ 2023 మెటీరియల్ సైన్స్ అండ్ రేర్ ఎర్త్‌లలో స్పెక్ట్రోస్కోపిక్ టెక్నిక్‌లపై ఒక రోజు లెక్చర్ వర్క్‌షాప్‌ని నిర్వహించనున్నాయి. ఉపకులపతి ఆచార్య కె. రాజా రెడ్డి బ్రోచర్‌ను విడుదల చేసారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ఆర్ఏఐఐ కార్యదర్శి డా॥ఎంఎల్‌పి రెడ్డి, డీన్ ఆర్అండ్‌డి, ఆచార్య ఎస్. విజయ భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య వి. పద్మావతి డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజిక్స్ హెడ్ ఆచార్య ఆర్‌పి విజయలక్ష్మి, వర్క్ షాప్ కన్వీనర్ ఆచార్య బి. దేవప్రసాద్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డా॥పి. చంద్రశేఖర్, డా॥కమలా శ్రీనివాసస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద వైద్య విద్యార్థి శ్రీకర్ ను అభినందించిన జేఈవో



తిరుపతి టౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త : ఆయుర్వేద పరిశోధనలో ప్రతిబ కనబరిచిన ఎస్వీ ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థి ఎన్. శ్రీకర్ భరద్వాజను టిటిడి జేఈవో సదా భార్గవి సోమవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యశాస్త్రంలో భారతదేశంలోనే ఉన్నత పరిశోధనా సంస్థ అయిన న్యూఢిల్లీలోని సిసిఆర్ఎఎస్ సంస్థ ఆయుర్వేద వైద్య విద్యార్థుల్లో పరిశోధనపై అవగాహన పెంచి ప్రోత్సహించడానికి స్పార్క్ అనే పరిశోధన ప్రాజెక్టును 2022వ సంవత్సరంలో ప్రారంభించింది. దేశం మొత్తంలో 100 మంది విద్యార్థులను వారి పరిశోధన ప్రాజెక్టుల ఆధారంగా గుర్తించి ప్రోత్సహించింది. ఇందులో ఎస్వీ ఆయుర్వేద కళాశాల విద్యార్థి శ్రీకర్ భరద్వాజ చోటు దక్కించుకున్నారు. ఈ విద్యార్థి వాతరక్తం అనే వ్యాధిలో వాసాదిక్వాథం ఏరండ బీజ లేపము, క్షీరసేకం అనే ఆయుర్వేద ప్రక్రియల ప్రయోజనం అనే అంశం పై కాయ చికిత్స ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానప్రసూన పర్యవేక్షణలో చేసిన ఆయుర్వేద పరిశోధనకు ఉత్తమ పరిశోధనగా గుర్తింపు లభించింది. ఇందుకు గాను సిసిఆర్ఎఎస్ సంస్థ 50 వేల రూపాయిలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరం, ప్రొఫెసర్ జ్ఞానప్రసూన పాల్గొన్నారు.

## జగన్‌ను నమ్ముకుంటే..భిక్షమెత్తుకోవాల్సిందే!

**-జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 28 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ముకుంటే ఎవరైనా భిక్షమెత్తుకోవాల్సిందేనని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ ఎద్దేవా చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన నగరిలో జరిగిన జగనన్న విద్యా దీవెన కార్యక్రమం లో ఎమ్మెల్యే రోజా జనసేన పార్టీపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందించారు.ఆయన మాటల్లోనే..సిఎం జగన్ మెప్పు కోసం ప్రతిపక్షాలను అర్థం పర్థం లేని ఆరోపణలతో విమర్శ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థులు టిడిపిని నమ్ముకుంటే జైళ్లకు,జనసేన పార్టీని నమ్ముకుంటే సినిమాలకు, జగనన్నను నమ్ముకుంటే వారి కుటుంబాలు చల్లగా ఉంటాయని రోజా చెప్పడం హాస్యా స్పదంగా ఉందన్నారు. రోజుకో కారు,బంగ్లా కొనే స్థాయికి నీవు వచ్చావు రోజా,నీ అవినీతి ఆస్తుల చిట్టా మా దగ్గర ఉంది.మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు.లేదంటే నీ అవినీతి బండారం,నీ చీకటి బాగోతం మొత్తం ప్రజల ముందు ఉంచుతామని ఎమ్మెల్యే రోజాను హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజారెడ్డి, రాజమోహన్, హేమకుమార్,రాజేష్ ఆచారి, ముస్వామి, కిషోర్, రమేష్, ఆది, మధులు పాల్గొన్నారు.

## ఎన్జీటి నిషేధాజ్ఞలు యథేచ్ఛగా ఉల్లంఘన



చంద్రగిరి, ఆగస్టు 28 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణకై ఎన్జీటీ ఇచ్చిన నిషేధాజ్ఞలను సైతం రాష్ట్ర ప్రభుత్వం యధేచ్ఛగా ఉల్లఘిస్తున్నట్లు టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి దుయ్యబట్టారు. రెడ్డివారిపల్లి ఇసుక రీచ్ వద్ద సోమవారం టిడిపి ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక దోపిడీపై టిడిపి అధిష్టానం నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పులివర్తి నాని సూచనలతో మూడు రోజులు నిరసన కార్యక్రమాలు నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. మొదటి రోజున ఇసుక రీచ్‌ల వద్ద సత్యాగ్రహ దీక్ష , రెండవ రోజున తహశీల్దార్, పోలీస్‌లకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. మూడవ రోజున మైనింగ్ కార్యాలయం ముట్టడించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ అండదండలతో ప్రైవేటు సంస్థ ఇసుకను అక్రమంగా దోచుకుపోతూ ప్రభుత్వ పెద్దలకు కోట్లాధి రూపాయలు ముడుపులు చెల్లిస్తున్నట్లు ఆరోపించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఇసుక దోపిడీతో కోట్లాది రూపాయలు దండుకుటున్నట్లు ఆరోపించారు. సహజ సంపదను కొల్లగొట్టి ప్రకృతి వినాశనానికి పాల్పడుతూ అక్రమార్జనకు తెగబడుతున్నట్లు ధ్వజమెత్తారు. ఇసుక దోపిడీదారుల కారణగా రీచ్‌లో ఒక విద్యార్థి మృతి చెందినట్లు గుర్తు చేశారు. ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇసుక మాఫియా అరికట్టాలంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, మహిళావిభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, పట్టణ అధ్యక్షుడు కాపువీధి సునీల్, నాయకులు వీరంగారి రమేష్‌రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, శానంబట్ల తులసి రెడ్డి, సజ్జా పురుషోత్తం నాయుడు, ఏ.జి.పల్లి బాల, బెల్లం కొండ రమేష్ రాయల్, శ్రీదర్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రప్రగతికి టిడిపి అధికారంలోకి రావాలి..!

**టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్**



రామచంద్రాపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త: రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ అన్నారు. సోమవారం చిట్టత్తూరు ఏఏ డబ్ల్యులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కావాలంటే నారా చంద్రబాబు నాయుడు మరొకసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఇసుక, మట్టి దోపిడీని నివారించడంలో అధికార యంత్రాంగం విఫలమయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, మధుసూధన్ రెడ్డి, కోటీశ్వర్ రెడ్డి, కుప్పారెడ్డి, మహేష్ నాయుడు, చిరంజీవి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## అత్తూరులో రిషితరెడ్డి ప్రచారం



రేణిగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త: రేణిగుంట మండలం అత్తూరు పంచాయతీలో శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితరెడ్డి మీ ఆశీర్వాదం కోసం మీ ఇంటికి బొజ్జల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి సోమవారం తిరిగి ప్రచారం చేశారు. అన్ని సమస్యలు పరిష్కారం కావాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. బొజ్జల సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యే చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారం చేసిన వారిలో తెలుగుదేశం పార్టీ జిల్లానాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రేణిగుంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు భాస్కర్‌రెడ్డి, బుజ్జినాయుడు, కొరియర్ రవి, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతరకు రాకుండా ఎలివేశారు : కన్యాక్షి కుమార్

రేణిగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త: రేణిగుంట మండలం ఎల్లమండ్యం ఎస్సీ కాలనీలో జరుగుతున్న మారెమ్మ జాతరకు గ్రామ పెద్దలు నాలుగు కుటుంబాలను బహిష్కరించారని(ఎలి వేశారు) ఎస్సీ యువ నాయకులు కన్యాక్షి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగే జాతరలో పొంగళ్లు పొంగించి అంబళ్లు సమర్పించే అర్హత ఆ కుటుంబ సభ్యులకు లేదా అంటూ ప్రశ్నించారు. ఇలా చేయడం వల్ల కుటుంబ సభ్యులు మనస్థాపానికి గురయ్యారని బాధపడ్డారు. మారెమ్మతల్లి జాతరకు ఎవరిని బహిష్కరించలేదని గ్రామ పెద్దలు తెలిపారు. ఎవరైనా జాతరకు ఆహ్వానితులే అన్నారు.

## మాతృభాషపై మమకారం ఉండాలి



వడమాలపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరికి మాతృభాషపై మమకారం ఉండాలని ఎస్వీపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ నాయుడు పేర్కొన్నారు. గిడుగు జయంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, కవితల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష తల్లి లాంటిదని దానిని ఎవరు నిర్లక్ష్యం చేయరాదన్నారు. మధురమైన మాతృభాషను ప్రతి ఒక్కరు తప్పని సరిగా నేర్చుకోవాలని సూచించారు. మాతృభాషపై గత నాలుగు రోజులుగా వివిధ పోటీలను నిర్వహించామని గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు రంగయ్య, ప్రకాశం, సూర్యప్రకాష్, సుదర్శనం, నరసింహారెడ్డి, కోమలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారం ఒక్క మధన్నతోనే సాధ్యం:పవిత్రారెడ్డి



శ్రీకాళహస్తి,ఆగస్టు 28 ప్రభాత వార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి ఒక్క మధన్నతోనే సాధ్యమని వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోని మంచినీళ్ళగుంట వద్ద నివాసముంటున్న 19వ వార్డులో విస్తృతంగా పర్యటించారు.ఇక్కడి ప్రజలు ఆమె దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. ఆమె ప్రజలతో మమేకమై వారి ఇంటిలో ఓ సభ్యురాలుగా వ్యవహరిస్తూ పర్యటించారు.ఈ సందర్భంగా ప్రజలు వివరించిన సమస్యలను తాను ఎంఎల్ఏ మధుసూధనరెడ్డి దృష్టికి తీసుకొచ్చి 'నెల లోపల' రోడ్డు నిర్మాణానికి భూమి పూజలు చేయించే బాధ్యత తనదంటూ భరోసా ఇచ్చారు.ప్రజలు సమస్యలను తన దృష్టికితీసుకురావాలని సూచించారు. ఆమెతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు,పార్టీ పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, వార్డు ఇన్‌ఛార్జి మాధవ్,శంకర్, జిలాని,బాల, గోపాల్,రఫీ, రాజా వినోద్, అరుణ్, రామయ్య, బావాజి,గౌస్, వంశీ,కృష్ణ, ప్రసాద్,మురళియాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో ఎంఎల్‌సి పూజలు



శ్రీకాళహస్తి,ఆగస్టు 28 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఎంఎల్‌సి పి వి వి సూర్యనారాయణ రాజు కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఇఓ ఆదేశాలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.ఏర్పాట్లను ఇఓ ఆదేశాలతో ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడు, పిఆర్ఓ వెంకటస్వామి పర్యవేక్షించారు.

## విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ధర్నా

రేణిగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త: విద్యుత్ సంస్కరణలు, పెంచిన విద్యుత్‌చార్జీలకు నిరసనగా స్థానిక అర్బన్ విద్యుత్‌కార్యాలయం వద్ద సీపీఎం పార్టీ నేతలు సోమవారం ధర్నా చేశారు. 2000 సంవత్సరంలో తెలుగుదేశం పాలనలో బషీర్బాగ్ వద్ద విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి హరినాథ్, ఓ.వి.రమణ, ఎంపీటీసీ రాజేశ్వరి, వార్డు మెంబరు ఈశ్వరమ్మ, నేతలు సత్యశ్రీ, శివానందం, దిలీప్ బాషా, నరసింహారెడ్డి, కృష్ణ, రాధాకృష్ణ, పద్మమ్మ, మహా లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అన్బుమణి రాందాస్‌ను సత్కరించిన చైర్మెన్



శ్రీకాళహస్తి,ఆగస్టు 28 ప్రభాతవార్త : ధర్మపురి లోక్ సభ సభ్యులు డాక్టర్ అన్బుమణి రాందాస్ కుటుంబసభ్యులతో సోమవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు.వారికి ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్‌మేరకు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేసారు.ఈ సందర్భంగా ఆయన ఛాంబర్‌లో పార్లమెంటు సభ్యునికి చైర్మెన్ సత్కరించారు. ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసిన ఆయన గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో సత్కరించి స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు.ఈ సన్మానాల కార్యక్రమాల్లో పట్టణ ప్రముఖులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, గురువారెడ్డి, మొగరాల గణేష్, భాస్కర్ ముదిరాజ్, సుబ్రమణ్యం రెడ్డి,, వవిజయకుమార్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

✱I.**REVURU GANGAMMA** (Old Name) R/at Thirumalarajupeta (V), Siddavaram (P), Penagalur (M), Annamayya Dist, A.P. Have changed my name to **TALLAPAKA GANGAMMA** W./o Revuru Maheswaraiah (New Name).

✱I, MEKALA KESAVULU NAIDU (Old Name), R/at D.No.18-39-S5-514, 2nd line, Abbanna Colony, Tirupati Dist, A.P. I, Have changed my name to MAHARSHI KESAVULU NAIDU S/o Maharshi Krishnama Naidu (New Name)

# స్విమ్స్‌ని అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకువెళ్లాలి : జేఈవో




తిరుపతి టౌన్, ఆగస్టు 28 ప్రభాతవార్త : స్విమ్స్‌ని అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకువెళ్లాలని టిటిడి జేఈవో సదా భార్గవికి తెలిపారు. సోమవారం స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతిగా డాక్టర్ ఆర్.వి. కుమార్ భాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన టిటిడి జేఈవో సదాభార్గవి ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్విమ్స్‌కు ఇంతకు మునుపు గవర్నమెంట్, టిటిడి ఆధీనంలో ఉన్నదని కానీ ఇప్పుడు స్విమ్స్‌ను పూర్తిగా టిటిడి పరిధిలోకి రావడం జరిగిందన్నారు. అప్పటి నుండి స్విమ్స్‌ను ప్రస్తుతం టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి, అప్పటి టీటీడీ ఈవో జవాహర్ రెడ్డి, అప్పటి టిటిడి చైర్మన్, ఇప్పటి టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చొరవతో స్విమ్స్‌కు కావాల్సిన అన్నీ సౌకర్యాలను సమకూర్చడం జరిగిందని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతిగా తాను బాధ్యతలు తీసుకున్న తరువాత 56 రోజుల అతి తక్కువ కాలంలోనే స్విమ్స్ ఒక సిస్టమ్‌లోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న డాక్టర్స్ ప్రమోషన్స్ కూడా ఒక కమిటీ ద్వారా విచారించి టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి ద్వారా ప్రమోషన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇకపై స్విమ్స్ డాక్టర్ ఆర్‌వి కుమార్ చేతిలోకి ఇవ్వడం జరిగిందని స్విమ్స్‌ను తాను అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతిగా తనకు ఈ అవకాశం రావడం ఆ భగవంతుని, తల్లిదండ్రుల ఆశీస్సులతో రావడం జరిగిందన్నారు. గత 32 సంవత్సరాలుగా నిమ్స్ హాస్పిటల్ హైదరాబాద్ నందు సిటీ సర్జరీ విభాగాధిపతిగా సేవలందించడం జరిగిందన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రిని కలిసినప్పుడు స్విమ్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. స్విమ్స్ ఉద్యోగులందరికీ ఎటువంటి ఇబ్బందులు కలిగినా ఎల్లప్పుడు తనను సంప్రదించవచ్చునని తెలిపారు. తొలుత కాలేజీ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి స్విమ్స్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన డైరెక్టర్‌కి వివరించారు. మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ మాట్లాడుతూ డాక్టర్ ఆర్‌వి కుమార్ చేసినటువంటి సేవలు సాధించినటువంటి అవార్డులు, రివార్డులు అతను రాసిన మెడికల్ బుక్స్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో డీన్ డా. అల్లడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా, కాలేజీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ మాధవి, డాక్టర్ సుధారాణి, ఆర్ఎంఒ డాక్టర్ కోటి రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాల ఆహ్వాన, గోడపత్రికల ఆవిష్కరణ



కాణిపాకం, ఆగస్టు 28 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి 2023 సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలకు సంభందించి ముద్రించిన గోడపత్రిక, ఆహ్వానపత్రికలు, బ్రోచర్‌లు, గణేష్‌దీక్ష కరపత్రాలను సోమవారం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ఆవిష్కరించారు. కాణిపాకం దేవస్థానంలో సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 8 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు ఈఉత్సవాల విజయవంతం చేయడంలో భాగంగా ప్రచార నిమిత్తం ఆహ్వాన పత్రికలను, గోడపత్రికలు, బ్రోచర్‌లను దేవస్థానం ముద్రించింది. వీటిని ఉదయం ప్రధాన ఆలయంకు మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చి ధ్వజస్థంభం వద్ద వుంచి వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే బాబు ఆవిష్కరించారు. వీటిని రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా పంపిణీ చేయనున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్ రంగస్వామి,స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి,ఐరాల మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌లతో పాటు ఆలయ ఉభయదారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా కాణిపాకం ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే బాబుకు ఆలయ చైర్మన్, మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## ముఖ్యమంత్రికి ఘనస్వాగతం వీడ్కోలు



రేణిగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ప్రత్యేక విమానంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నాగార్జునతో కలసి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు కల్యాణ చక్రవర్తి, సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరం రెడ్డి, జేసీ డి.కె.బాలాజీ, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే సంజీవయ్య, నేదురుమల్లి రాంకుమార్, రేణిగుంట వైసీపీ యువ నాయకులు శ్రీధర్‌రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ శిరీష, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, డీఎస్పీ భవ్య కిషోర్, రేణిగుంట తహసీల్దార్ ఉదయ్ సంతోష్, ఏర్పేడు తహసీల్దార్ శివప్రసాద్, తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలోఉన్నారు. అనంతరం చిత్తూరు జిల్లా నగరి కీళపట్టుకు ముఖ్యమంత్రి హెలిప్యాడ్‌లో బయలుదేరి వెళ్లారు. ఆయనతో పాటు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నాగార్జున వెళ్లారు. పర్యటన ముగించుకుని ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి గన్నవరం బయలుదేరి వెళ్లారు.

## రాష్ట్రష స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో 9వ స్థానం

వెంకటగిరి, ఆగస్టు 28 ప్రభాతవార్త: వెంకటగిరిలో జరిగిన విజయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలలో వెంకటగిరి మదర్ అకాడమీ స్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థి వయ్యావూరు విఘ్నేష్ 9వ స్థానం సాధించాడు. ఈ పోటీలలో 231 మంది చెస్ క్రీడాకారులు అన్ని జిల్లాల నుంచి పాల్గొన్నారు. అంతర్జాతీయ రేటింగ్ క్రీడాకారులు 13 మంది పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో హరీష్ (చెన్నై), సంతోష్ మణికంఠన్ (కడప), సుమన్ (నెల్లూరు) లు నిలిచారు.

## 39వ రాష్ట్ర సీనియర్ క్యోరుగి, 12వ పూమే టైక్వాండో ఛాంపియన్‌షిప్



తిరుపతి (క్రీడ), ఆగస్టు 28 ప్రభాతవార్త : 39వ రాష్ట్ర సీనియర్ క్యోరుగి అండ్ 12వ పూమ్సే టైక్వాండో ఛాంపియన్‌షిప్ ప్రమోట్ చేయడం జరిగిందని వైస్ ఛాన్సలర్ భారతి, రిజిస్ట్రార్ ప్రొ. ఎన్. రజిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన ఈజి జిల్లా టైక్వాండో అసోషియేషన్ ఈ నెల 26వ తేది నుంచి 27వ తేది వరకు ఈ టోర్నమెంట్‌లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులు వివిధ వెయిట్ విభాగాల్లో పాల్గొని చెరిష్మా బిటెక్ 2వ సంవత్సరం 53 కిలోల బరువు విభాగంలో బంగారు పతకం, జ్యోతి బిఎ ఎల్ఎల్‌బి 2వ సంవత్సరం కాంస్య పతకం అండర్ 53 వెయిట్ కేటరిరీ, ఆశ్లేషా బిఎ ఎల్ఎల్‌బి 2వ సంవత్సరం కాంస్య పతకం అండర్ 53 వెయిట్ కేటగిరి, లావణ్య కుమారి ఎల్ఎల్‌బి 2వ సంవత్సరం కాంస్య పతకం అండర్ 53 వెయిట్ కేటగిరి విభాగాల్లో పతకాలు సాధించారు. వీరిని వైస్ చాన్సలర్ ప్రొ. భారతి, రిజిస్ట్రార్ ప్రొ. రజిని, ప్రొ. అనురాధ డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ప్రొ. జి. సారా సరోజిని, ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డిపార్ట్మెంట్ సి. రమణన్, ఇతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు. స్టేట్ మీట్‌లో గోల్డ్ మెడల్ సాధించి, నేషనల్స్‌కి ఎంపికైన చెరిష్మా ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమె 9 నుండి 11 సెప్టెంబర్ వరకు గోహతిలో అస్సాం స్టేట్ టైక్వాండో అసోసియేషన్ నిర్వహించే జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొంటుందన్నారు.

## శివయ్య సేవలో కలెక్టర్ రాహుకేతుదోష నివారణ పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త : పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ,సర్పదోష పూజలకు భక్తులనుంచే కాకుండా వివిపిల నుంచి కూడా స్పందన లభిస్తుంది. ఈ నేపధ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ వెంకట రమణా రెడ్డి కుటుంబసభ్యులతో ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. ఆర్‌డిఓ కెయస్ రామారావు ఆలయ ఎఇఓ సతీష్‌మాలిక్‌తో ఏర్పాట్లు చేసారు. సహస్రలింగేశ్వరుని ఆలయం ఎదురుగా వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. తరువాత స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## వన్నెకుల క్షత్రియుల సంక్షేమానికి సదా కట్టుబడి ఉంటాం:అన్బుమణి రామదాసు



శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త : ఉమ్మడి చిత్తూరుజిల్లాలో అత్యధిక శాతం వన్నెకుల క్షత్రియులు నివాసముంటున్నారని అయితే వారికి రాజకీయ ప్రాధాన్యత ఇవ్వటం లేదని వన్నెకుల క్షత్రియులు సంఘటితంగా ఉంటూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వంలో అవకాశాలను పునికి పుచ్చుకోవాలని మాజీ కేంద్ర మంత్రి తమిళనాడు పిఎంకే అధ్యక్షులు అన్బుమణి రామదాసు అన్నారు. సోమవారం ఆయన కుటుంబసభ్యులతో కలసి శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం నిమిత్తం రాగా వారికి పరిపాలనా భవనాల వద్ద వన్నెకుల క్షత్రియులు భారీ స్వాగతం ఏర్పాటు చేసారు. తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి సారధ్యంలో స్వాగత సన్నాహాలు చేసారు. ఈ సందర్భంగా అన్బుమణి రాం దాసు మాట్లాడుతూ నేడు దేశంలో రాజకీయ పరిస్థితి అనిశ్చితంగా ఉందన్నారు. కాబట్టి వన్నెకుల క్షత్రియులు తమ డిమాండ్‌ను ఎవరైతే పరిష్కరిస్తారో వారితో నడవటానికి సిద్ధం ఉండాలన్నారు. ఏది సాధించాలన్నా మనం సంఘటితంగా ఉండాలన్నారు. సమస్యలు వచ్చినపుడు పార్టీల కతీతంగా పోరాటాలకు అయినా సిద్దంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఇక ఉమ్మడి చిత్తూరుజిల్లాలో రాజకీయ పరిస్థితిపై ఆయన ఆరా తీసారు. తాము ఎప్పుడైనా అందుబాటులో ఉంటామన్నారు. శ్రీకాళహస్తిలో పార్టీల కతీతంగా వ్యవహారించటం అభినందనీయం అన్నారు. స్వాగతం చెప్పిన వారిలో రాష్ట్ర సాధికారిక కమిటి సభ్యులు మిన్నల్‌రవి, నియోజకవర్గ వెన్నెరెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కె జనార్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్రమణ్యం రెడ్డి, పల్లవ సంఘం అధ్యక్షుడు మస్తాన్‌రెడ్డి, ఇతర నాయకులు దొరైరాజురెడ్డి, గుణశేఖర్‌రెడ్డి,సుందరం,ఎంఎస్‌రెడ్డి,ప్రతాపరెడ్డి, భయ్యారెడ్డి, విజయ కుమార్‌రెడ్డి, మహేష్, మునికృష్ణారెడ్డి,మునిశేఖర్,డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు. ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## శ్రీకళ్యాణ వెంకన్న ఆలయంలో పవిత్రాలు సమర్పణ

**-తిరుమల తరహాలో వైఖానస ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు**



తిరుపతిరూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త: తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో రెండో రోజు సోమవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం స్వామిని సుప్రభాతంలో మేల్కొలిపి, తోమాల, అర్చన వంటి దైనందిన పూజా కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో జరిపిన వైదిక కార్యక్రమాలు అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనే, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంలతో అభిషేకం చేసారు. మూలవర్లకు, గరుడాళ్వార్ పరివార దేవతలకు ధ్వజస్తంభానికి, శ్రీఆంజనేయస్వామివారికి శాస్త్రోక్తంగా పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం 5గంటల నుండి 6:30 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుమ్మలగుంట గ్రామ సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు నల్లందుల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు

తిరుపతి క్రైం, ఆగస్టు 28 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజల సమస్యలకు, ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఎస్పి కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పిలు వెంకట్రావు పరిపాలన, విమల కుమారి నేర విభాగం వారు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా నలుమూలల నుంచి 55 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులందరితో ఎస్పి మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుటుంబం కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. స్పందన ఫిర్యాదులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు, ఫిర్యాదులను చట్టప్రకారం విచారణ జరిపించి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.

## బిసిలను ఆదరించింది తెలుగుదేశంపార్టీనే



శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త : గడచిన 75సంవత్సరాల రాష్ట్ర రాజకీయ చరిత్రలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అనేక మందికి సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ స్వావలంభన దిశగా అడుగులు వేయించి అభివృద్ధి పథంలో నడిపించి బిసిలను అక్కున చేర్చుకుని అందరించినది తెలుగుదేశంపార్టీ ఒక్కటే అని పార్టీ బిసి విభాగం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలిసీ తెలియని జ్ఞానంతో కొంతమంది వైసిపి తమ్ముళ్ళు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ బిసిలకు రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించలేదని విమర్శించడం హ్యాస్యాస్పదం అన్నారు. 1996-2002 మద్య కాలంలో రాజ్యసభ సభ్యుడిగా ఉన్న రుమాండ్ల రామచంద్రయ్య ప్రస్తుత తెలంగాణా రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన బిసి నాయకుడు అని ఈయన నియామకం చేసింది చంద్రబాబునాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అనే విషయాన్ని వైసిపి తమ్ముళ్ళు తెలుసుకోవాల్సి ఉందని హితవు పలికారు. అలాగే 2010-16 మద్య కాలంలో గుండు సుధారాణి, 2012-2018 మద్య కాలంలో టి.దేవేందర్‌గౌడ్‌ను బిసి విభాగంలో రాజ్యసభ సభ్యులుగా తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నియమితులయ్యారన్న విషయాన్ని రాజకీయ అవగాహన లేని వారు తెలుసుకోలేదరని ఎద్దేవా చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా యాదవ సామాజిక వర్గానికి చెందిన పుట్టాసుధాకర్‌యాదవ్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా నరసింహ యాదవ్‌లకు అవకాశం కల్పించి బిసిలను ఆదరించింది ఒక్క తెదేపా నేత చంద్రబాబునాయుడు అని ఆయన్ను విమర్శించే సాహసం చేయవద్దని వైకాప తమ్ముళ్ళకు హితవు పలికారు. సమావేశంలో తెదేపా బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు బీమాల బాస్కర్‌ముదిరాజ్, మణి, వంశీకృష్ణ, రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక సాగర్ పనులు వేగవంతం చేయండి

**అధికారులను ఆదేశించిన కమిషనర్ హరిత**



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 28 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రూపుదిద్దుకుంటున్న వినాయకసాగర్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. సోమవారం వినాయక సాగర్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చిదిద్దుతున్న వినాయక సాగర్ పనులను వేగవంతం చేయాలన్నారు. సందర్శ కులను ఆకర్షించే విధంగా స్వాగత ఆర్చ్ ఏర్పాటు చేయించాలన్నారు. అదే విధంగా వినాయక సాగర్ లోపల ఏర్పాటు చేస్తున్న ఆదేశాలపై డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వినాయక సాగర్ లోపల ఏర్పాటు చేయనున్న అమ్యూజిమెంట్ పార్క్, రెస్టారెంట్, బోటింగ్ పాయింట్ల ఏర్పాట్ల పనులు పూర్తికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆధునిక వలుగులు నింపే విద్యుత్ దీపాలను వినాయక సాగర్‌లో ఏర్పాటు చేయాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినాయక సాగర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, డిఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

## పల్లే ఆటోలా అయితే ప్రాణం జరా భద్రం

**-అటోలల్లో 25 మందికి పైగా ప్రాయాణం**



వెంకటగిరిరూరల్ ఆగస్టు 28ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతల నుంచి వచ్చే అటోలల్లో ఎక్కి ప్రయాణించాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకోని ప్రాయణం సాగించల్సిందే వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలల్లోని గ్రామీణ ప్రాంతలల్లో వరి సాగు వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగడంతో గ్రామలనుంచి వ్యవసాయ పోలాలు వద్ద ఒక అటలో 20 మందికి పైగా ప్రయాణిస్తున్నారు. అనుభవం లేని అటో డ్రైవర్‌లతో ఇలా మూడు మూడు మండాలల్లో గ్రామీణ వ్యవసాయ కూలీలు తమ ప్రాణాలు ఆరిచేతిలో పెట్టుకోని కడుపు కూటితో తెల్లవారు జోమనే ప్రాయణం చేస్తున్నరు. గత సంవత్సరంలో వెంకటగిరి-గూడురు రోడ్డు మార్గం వ్యవసాయ కూలీలు వస్తున్న అటోను డీకోనడంతో ముగ్గురు మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నయని అంతే కాకుండా పట్టణానికి రావలన్న అటోలల్లో అదికంగా ప్రయాణికులు ఎక్కించుకోవడం అటోలను పరిపాటిగా మరాపోయింది. అదిక లోడు అటోలను నియంత్రం లేక పోవడంతో రోజు రోజు పరిస్థితి మరింత భయనీయంగా మారింది. ఇప్పటికైన సంబందిత ఉన్నతాదికరాలు చోరవ తీసుకోని అదిక లోడులో వ్యవసాయ కూలీలను, ప్రాయణికులు తరలిస్తున్న అటోలను అదుపులోకి తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## దేవుని దర్శనంలో జాన్వీ



తిరుమల, ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి: బాలీవుడ్ నటి, దివంగత సినీనటి శ్రీదేవి కుమార్తె జాన్వీకపూర్ సోమవారం ఉదయం సాంప్రదాయ దుస్తులు ధరించి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయం వెలుపల మహద్వారం గేట్ వద్ద మోకాళ్ళపై కూర్చుని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

# ప్రకృతి వనరులను దోచుకుంటున్న వైకాపా ప్రభుత్వం

**-పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా : సుధీర్‌రెడ్డి**

తొట్టంబేడు, ఆగస్టు 28 ప్రభాతవార్త : మట్టిని, ఇసుకతో పాటు ప్రకృతి వనరులను కూడా వైకాపా ప్రభుత్వం దోచుకుంటోందని ఇసుకమాఫియాతో దోచుకో..దాచుకో అన్న నినాదంతో ముందుకు వెళ్తూ స్వర్ణముఖీనదీమతల్లికి గర్భశోకం మిగిలిస్తున్నారని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ఇసుకాసురుల భాగోతం బయటపెట్టాలన్న పిలుపుతో సోమవారం రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళీనాయుడుల ఆధ్వర్యంలో మండలంలోని పెన్నలపాడు గ్రామం సమీపంలో ఉన్న ఇసుకరీచ్ వద్దకు సైకో పోవాలి.. సైకిల్ పాలన రావాలని..అంటూ ప్లేకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేశారు. పెన్నలపాడు ఇసుకరీచ్‌కు అనుమతి లేకపోయినా ఇక్కడ నుంచి దొంగబిల్లులతో ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలిస్తున్నారని దీంతో రోడ్లు అస్తవ్యవస్థంగా మారిపోయాయన్నారు. నదిలో 12అడుగుల వరకు తవ్వేసి ఇసుకను తరలిస్తున్నారని తాము రాకముందు ఇక్కడ సుమారు 70వరకు పైగా ట్రాక్టర్లు ఉన్నాయని అయితే ప్రస్తుతం ఇవేమీ కనిపించడం లేదన్నారు. ఓ బడా ఇసుక స్మగ్లర్‌ను అడ్డం పెట్టుకుని ఇసుకను దోచుకుంటున్నారన్నారు. ప్రకృతి వనరులను వైకాపా నాయకులు దోచుకుంటుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి ఏం నిద్రావస్థలో ఉన్నారని దుయ్యబట్టారు. ఏర్పేడు మండలం కోబాకలో కూడా ఇసుకరీచ్ త్వరలో ప్రారంభిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అయితే ఇక్కడ ఏర్పాటు చేస్తే తానే దగ్గర ఉండి టిప్పర్లు, ట్రాక్టర్‌లను తగులబెడుతానని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఓబడాస్మగ్లర్ కూడా విజయసాయిరెడ్డి వల్ల ఇక్కడ నుంచి వెళ్ళిపోయారని గుర్తుచేశారు. ప్రశ్నిస్తే పోలీసుల వేధింపులు కేసులు పెడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులు దోచుకుంటుంటే వర్షాలు కూడా పడడం లేదన్నారు. తిరుపతి మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ మాట్లాడుతూ ఇసుకాసురుల భాగోతం బయటపెట్టాలని ఇసుకను దోచుకో.. దాచుకో అన్న నినాదమే ఈ ప్రభుత్వానికి సరిపోతుందన్నారు. మరో 8నెలల్లో వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని తెదేపా అధికారంలోకి వచ్చాక ప్రజలకు మంచిచేస్తామన్నారు. అనంతరం తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాలిమురళీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి, తిరుపతి పార్లమెంటు రైతు విభాగం ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, వూకా విజయకుమార్, రుద్రకోటి సదాశివం, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, పాలసరఫరా మాజీ ఛైర్మన్ మునిరాజనాయుడు, మాజీ సర్పంచ్ చెత్తమ నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, వజ్రంకిషోర్, మునిరాజయాదవ్, కన్నావరంహరిబాబు, పోలూరుశ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌నాయుడు, కిట్టు, లక్ష్మణ్, రామకృష్ణ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ విక్రమ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాఘవేంద్ర తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

